# పలుకుబడులు...





## కోటికి పడగ

పూర్వకాలంలో ధనికులకు సంఘంలో పలుకుబడి, గౌరవం లభించడమేకాక రాజుల ఆదరణ వుండేది. ఆ కారణంగా ధనికులు తమ ఐశ్వర్యాన్ని ప్రకటించుకునేవారు. అలా ప్రకటించుకోవడంలో వారు ఒక పద్ధతి అనుసరించేవారు. ఆ కాలంలో తమ వద్ద కోటి టంకాలు ( అప్పటి బంగారు నాణాలు) నిల్వ చేయగలిగితే ఆ ధనంపై ఒక నాగాభరణంగల శివలింగాన్ని వుంచి ధూప దీప నైవేద్యాలతో పూజించేవారు. ఇది గొప్ప వేడుకగా, పుణ్య కార్యంగా చేసేవారు. అలా చేయడంవల్ల వారి వద్ద ఎన్ని కోట్ల ధనం వుందో ప్రజలకేకాక జమిందారులు, రాజులకు కూడా తెలిసి వారికి విలువ, గౌరవం లభించేవి. జమిందారులు, రాజులు తమకు అప్పు కావలసి వచ్చినవుడు వారివద్దకు కబురు పంపేవారు. నాగాభరణ శివలింగాన్ని పూజించడం నాగరాజును ఆ ధనాన్ని సంరక్షించమని, లక్ష్మీదేవి తమ ఇంట నిలవాలని ఈశ్వరుడిని అర్చించడం ఆచారంగా వుండేది. ఈ ఆచారాన్ని బట్టే 'కోటికి పడగెత్తడం' అనేది వాడుకలోకి వచ్చింది. డబ్బుగల వారిని కోటికి పడగెత్తారు అని అనడం పరిపాటి అయ్యింది.

– అలివేలుమంగాదేవి

## ప్రసంగంలో ప్రావీణ్యం

'పార్లమెంట్ సభ్యుల భార్యామణులిద్దరు తమ భర్తల గొప్పతనం గురించి ముచ్చటించుకుంటున్నారు. అందులో ఒకామె "మా వారు ఏ విషయం మీదనైనా సరే గంటల తరబడి అనర్గళంగా మాట్లాడగలరు" అంది. అది విని రెండో ఆమె "మా వారైతే విషయం అంటూ లేకుండానే ఎంత సేపయినా మాట్లాడగలరు" అంది. –ఈదుపల్లి వెంకటేశ్వరరావు

# ఒకే బొమ్మ:



## వెలితి

సుందరమ్మగారు కాలంచేసి ఆరు నెలలవుతోంది.

వెంకట్రామయ్యకి ముసలి తల్లి మరణం అంత బాధనిపించలేదు.

ఖల్లు ఖల్లుమని దగ్గుతూ, మంచానపడి వుంటూ, యింట్లో వాళ్ళందరి చేతా చీదరింపబడడం కంటే ఆమె పోవడమే మంచిదిలే అనిపించింది.

అయితే,

ఈ మధ్యమాత్రం ఏమిటో పెద్ద లోటుగా అనిపిస్తోంది.

ఆఫీసుకి వెడుతున్నాడు, వస్తున్నాడు–

రెండు నెలల క్రితం ఆఫీసరుగా ప్రమోషన్ కూడా వచ్చింది.

జీతం పెరిగింది.

పరిస్థితులన్నీ బాగానే వున్నాయి – అనుకూలవతి అయిన భార్యా, చక్కగా చదువుకొంటున్న పిల్లలూ – దేనికీ లోటులేదు.

అయినా ఏదో అసంతృప్తి...

ఎందుకో తనకే తెలియదు.

తల్లి పోయిందని తెలియని బెంగా?

ఛ,ఛా– తనేమన్నా చిన్నవాడా? పెద్ద వయస్సు – ఎన్నాళ్ళుంటుంది? తనకే యాభై దగ్గర పడుతున్నాయ్– అందరూ ఎప్పుడో అప్పుడు పోవలసిన వాళ్ళేగదా!

మరయితే...??

***

ఆఫీసులో ఇన్‌స్పెక్షనవుతోంది. తనుదగ్గరుండి అన్నీ చూసుకోవాలి. అందుకని ఆ రోజు బయల్దేరుతూనే భార్యకు చెప్పేశాడు. 'నా కోసం చూడకు, మధ్యాహ్నం యింటికిరావడం కుదరదు. రాత్రికి కూడా రావడం ఆలస్యం కావచ్చు. జాగ్రత్తగా వుండండి. కంగారులేదు' అంటూ. భార్య ప్యూన్‌ని పంపిస్తే కారియర్ పంపుతానంది. అవసరం లేదన్నాడు.

పని ముగించుకుని యింటికి తిరిగి వచ్చేసరికి రాత్రి పదకొండు గంటలయ్యింది.

పిల్లలు పడుకున్నారు. భార్య ఏదో పుస్తకం చదువుకుంటూ, తన కోసమే నిరీక్షిస్తోంది.

"బాగా ప్రొద్దు పోయిందండీ. కంగారుపడుతున్నాను మీరింకా రాలేదని" అంది భార్య.

వెంకట్రామయ్య తలెత్తి ఆమె మొహంలోకి చూశాడు.

తిండీ, నిద్రా మానుకుని తన కోసం అంత సేపు ఒంటరిగా కూచుందంటే ఆమె గాబరాపడి వుంటుంది! నిజమే, భర్త తోడిదే జీవితం అయినప్పుడు ఆడదాని ప్రాణాలన్నీ మగవాడి మీద వుండవా మరి!

అంతలోనే ఏదో గుర్తువచ్చినవాడిలా చటుక్కున వరండాలోకి వచ్చి మూలకి తొంగి చూశాడు.

ఆ మూలే తల్లి మంచం వుండేది.

ఆ ప్రదేశం యిప్పుడు ఖాళీ!

వెంకట్రామయ్యకి యింత కాలానికి బోధపడింది. ఇన్నాళ్ళూ తనను పీడించిన అసంతృప్తి ఏమిటో–

అవును, భార్యా పిల్లలూ తన మీద ఆధారపడి జీవిస్తున్నవారు. వారికి దిక్కు తను – మరి తనకు దిక్కు?

ఆఫీసు నుంచి రావడం అరగంట ఆలస్యమయితే చాలు ప్రాణాలన్నీ కళ్ళల్లో పెట్టుకొని గుమ్మం కేసే చూస్తూ వుండేది తల్లి.

తనురాగానే 'బాబూ వచ్చావా? ఆలస్యమైందేరా? వెళ్ళు, కాళ్ళు కడుక్కుని టిఫిన్ తిను' అనేది ప్రేమగా. ఆ ప్రేమ తనకిప్పుడేదీ?

– డాక్టర్ వాడవల్లి చక్రపాణిరావు